క్లుప్తంగా

ఘనంగా అఖండ నామ సంకీర్తన



బాబా అఖండ నామ సంకీర్తనలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం విజయశమి సందర్భంగా బాబాకు ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలను నిర్వహించారు. బాబా మహా సమాధి జరిగి 106వ పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అఖండ నామ సంకీర్తనలు చేపట్టారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోటూరు సాయిరామ్ ప్రసాద్, సాయి సేవా సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం



పుష్పయాగ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహలక్ష్మీ సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం రాత్రి పుష్పయాగం నిర్వహించారు. ముందుగా పూలతో ఊరేగింపు చేపట్టారు. పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు



ఓజిలి: దసరా సందర్భంగా మానమాల గ్రామంలోని బాబా మందిరంలో భక్తులు సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. మందిరంలో నార్నిపాటి హరికృష్ణశర్మ, రాము పండితులు మంత్రోచ్ఛారణతో బాబాకు క్షీరాభిషేకం, ఇతర అభిషేకాలు చేశారు. సాయినాథుని విశేషంగా పూలతో అలంకరించారు. మందిర నిర్మాణకర్తలు ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, శోభారాణి, సాయి సుప్రియ ఉభయకర్తలుగా వ్యవహరించారు. 1000 మందికి అన్నదానం చేశారు. రాత్రి బాబా పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మందిరాన్ని విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

చిల్లకూరు: దివ్యాంగులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని కార్యదర్శి రామానాయుడు తెలిపారు. మండలంలోని చేడిమాల గ్రామంలోని ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆదివారం దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకాడుకు చెందిన షేక్ బాబు, బత్తలాపురానికి చెందిన తలారి రాజేంద్ర, యల్లసిరికి చెందిన దాసరి సుబ్రహ్మణ్యం, పార్లపల్లికి చెందిన కుమార్‌లకు ట్రై సైకిళ్లు అందించామన్నారు. గూడూరు మండలం పురిటిపాళెం గ్రామానికి చెందిన క్యాన్సర్ పేషెంట్ జీవనాధారం కోసం తోపుడు బండిని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వెంకటేశ్వర్లునాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చైతన్యవంతం కావాలి



కరపత్రాల ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్: సమాచార హక్కు చట్టంపై ప్రజలు చైతన్యవంతులైతే ప్రజాసంక్షేమ విషయాలు, ఇతర లోటుపాట్లను తెలుసుకోవచ్చని సమాచార హక్కు ప్రచార సంస్థ తిరుపతి జిల్లా అధ్యక్షుడు తీగల భాస్కర్ అన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి అక్టోబర్ 12 నాటికి 19 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నాయుడుపేటలోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చట్టం సక్రమంగా అమలు జరిగేందుకు రాష్ట్ర సమాచార కమిషన్ ప్రత్యేక చర్యలు సైతం చేపడుతోందన్నారు. సమాచార హక్కు చట్టం వివరాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రచార సంస్థ సభ్యులు యాకసిరి రామయ్య, కుడుమ అనిల్ కుమార్, మలిశెట్టి శివయ్య,ఎం వెంకట మహేష్ తదితరులు ఉన్నారు.

ఆక్వా రైతులకు పూర్తి సహకారం

చిల్లకూరు: ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే యాజమాన్యాలు ఆక్వా రైతులకు పూర్తి స్థాయి సహకారం అందించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని ఓడూరు పంచాయతీ పరిధిలోని పున్నపువారిపాళెం సమీపంలో ఓ మెరైన్ ప్రొడక్ట్స్ అనే పరిశ్రమను ప్రారంభించారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్, జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, ఓడూరు సర్పంచ్ నాగిశెట్టి శారదమ్మ, తానంకి నానాజీ, గంటా ముద్దుక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలో రోగులు



ఖాళీగా ఉన్న పడకలు



రక్త నిల్వ పరికరాలు



ఆరోగ్యం.. అందని ద్రాక్ష

రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. తగిన సంఖ్యలో వైద్యులు, సిబ్బంది, సరైన వసతులు, వైద్య పరికరాలు లేకపోవడంతో సరైన వైద్యసేవలు అందడం లేదు. కోట్లాది రూపాయలతో ఆధునిక భవనాలు ఉన్నప్పటికీ వసతుల లేమితో ఆరోగ్యం అందని ద్రాక్షలా మారింది. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే ఆర్థిక స్తోమత లేక రాపూరు ప్రాంత పేద ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వ వైద్యం అందని పేద రోగులను కదిలిస్తే కన్నీళ్లు పెంటుకుంటున్నారు.

– రాపూరు

- పేరుకే 50 పడకల ఆసుపత్రి
- పరికరాలు లేక అందని వైద్య సేవలు
- వైద్యుల కొరతతో రోగులకు అవస్థలు



రాపూరు ప్రభుత్వ వైద్యశాల

వైద్యుల కొరత

రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం 50 పడకల ఆసుపత్రి. ఇక్కడ 12 మంది డాక్టర్లు ఉండాల్సి ఉంది. అయితే ఏడుగురు డాక్టర్లు మాత్రమే ఉన్నారు. రాపూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల లేమితో రోగులకు అవస్థలు తప్పడం లేదు. మారుమూల ప్రజలు సౌకర్యార్థం 1947 సంవత్సరంలో ఏర్పాటు చేసిన వైద్యశాల నేటికీ ఎదుగుబొదుగు లేకుండా ఉంది. ప్రతి రోజు 350 నుండి 400 మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో దంత వైద్యులు, కంటి వైద్యులు, చెవి ముక్కు, గర్భకోశ వ్యాధి నిపుణులు ఇద్దరు, మత్తు డాక్టర్, జనరల్ వైద్యులు ఉండాల్సి ఉంది. అయితే కంటి, పంటి, చెవిముక్కుకు సంబంధించిన వైద్యులు మాత్రమే ఉన్నారు. వారికి కూడా కావాల్సిన పరికరాలు లేకపోవడంతో వారు ఉన్నా ప్రయోజనం లేకుండా ఉంది.

ప్రమాదాలకు చేరువ

రాపూరుకు సమీపంలో ఘాట్‌రోడ్డు, జాతీయ రహదారి, అధిక సంఖ్యలో క్రషర్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు సంభవించడం సర్వసాధారణం. కాళ్లు, చేతులు విరగడం, సర్జరీలు అవసరమైనవారు వస్తుంటారు. అయితే ఆర్థోపెడిస్ట్, జనరల్ సర్జన్లు లేకపోవడంతో ఇక్కడి నుంచి గూడూరు, నెల్లూరుకు తరలించాల్సి వస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లల వైద్యులు లేకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పోస్టు మార్టం చేసే వైద్యులు కూడా అందుబాటులో లేదు. సెక్యూరిటీ గార్డులు కూడా లేరు. దీంతో మద్యం మత్తులో వచ్చే కొందరు రోగుల కారణంగా వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని జిల్లా యంత్రాంగం

రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, పరికరాల కొరతపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు, జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకపోతోంది. అనుకోని ప్రమాదాల్లో ఎవరైనా మృతి చెందితే వైద్యాధికారులు వచ్చి వైద్యులు, పరికరాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి వెళ్తున్నారే తప్ప ఆ తరువాత పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వైద్యులను నియమించాల్సి ఉంది.

రక్తం మిషనరీలు ఉపయోగకరం

రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వం రక్తాన్ని నిల్వ చేసే పరికరాలను అందించింది. ప్రతి మాసంలో శిబిరాలను ఏర్పాటు చేసి రక్తాన్ని దాతల సహకారంతో సేకరిస్తున్నారు. రక్తాన్ని గూడూరు ఏరియా వైద్యశాలకు పంపి, స్కానింగ్ చేసి అక్కడ నుంచి ఇక్కడకు రక్తాన్ని తీసుకువస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం అవసరమైతే వీటిని ఉపయోగిస్తామని వైద్యులు తెలిపారు.

వైద్యులను నియమించాలి



రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో 12 మంది వైద్యులకు ఏడుగురు మాత్రమే ఉన్నారు. మిగిలిన వైద్యులను నియమిస్తే ప్రజలకు వైద్యసేవలు అందుతాయి. ప్రతి దానికి నెల్లూరు, గూడూరు ప్రాంతాలకు పేద ప్రజలు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి అత్యవసర సేవలు అందించే వైద్యులను వెంటనే నియమించాలి. ఈ ప్రాంత రోగులను కాపాడాలి.

- రామ్‌మోహన్‌రెడ్డి, రాపూరు

సరైన పరికరాలు ఏర్పాటు చేయాలి



పేరుకే 50 పడకల వైద్యశాల. అందులో కావాల్సిన వైద్య పరికరాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు ఉంటే వారికి అవసరమైన పరికరాలు లేవు. దీంతో వారు ఉన్నా నిరుపయోగమే. నిత్యం కాళ్లు, చేతులు విరిగే రోగులు అధికంగా వస్తుంటారు. ఎముకల వైద్యుడిని నియమించాలి. చిన్నపిల్లల వైద్య నిపుణుడు, సర్జరీలు చేసే వైద్యులను నియమించాలి. వారికి అవసరమైన మందులు, వైద్యపరికరాలు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలి.

- వెంకటనరసారెడ్డి, ఆకలివలస, రాపూరు మండలం

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



రాపూరు వైద్యశాలలో అత్యవసరమైన వైద్యులు, వైద్య పరికరాలు అవసరమని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆపరేషన్లు చేసే సర్జన్లు, ఎముకలు, చిన్నపిల్లల వైద్యులను నియమిస్తామన్నారు. ఉన్న వైద్యులకు, రాబోయే వైద్యులకు అవసమైన పరికరాలు, మందులు అందిస్తాం. జిల్లా, రాష్ట్ర స్థాయి వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు స్పందించి పోస్టులను భర్తీచేయాలి.

- డాక్టర్ నర్మదాదేవి, వైద్యాధికారి, రాపూరు

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు(చిల్లకూరు): కార్యకర్తలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ భరోసా ఇచ్చారు. చిట్టమూరు మండలంలోని తాడిమేడు గ్రామంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు మధు నూతన గృహప్రవేశానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తమ కార్యకర్తలను భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. అయితే ఎక్కడా భయపడనక్కరలేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ చిట్టమూరు మండల అధ్యక్షుడు సన్నారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, కె.రమేష్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, అనపల్లి గోపి, ఆశా శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పెంచలకోనలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



అశ్వ వాహనంపై ఊరేగుతున్న శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి



స్వామివారి కల్యాణోత్సవం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవికి నిర్వహిస్తున్న శరనన్నరాత్రి మహోత్సవాలు విజయదశమితో ముగిశాయి. శనివారం ఉదయం 9 గంటలకు స్వామివారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం విగ్రహాన్ని అశ్వవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణతో ఆర్టీసీ బస్టాండు వద్ద వరకు పారువేటకు స్వామివారు తరలివెళ్లారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

గోనుపల్లిలో క్షేత్రోత్సవం

విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని గోనుపల్లిలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని అశ్వవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బాలిరెడ్డిపాళెంలో కలిసిన పూర్వ విద్యార్థులు

వాకాడు: బాలిరెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన ఆనాటి విద్యార్థులు 33 ఏళ్ల తరువాత ఆదివారం ఒకే వేదికపై కలిశారు. వివిధ ప్రాంతాల్లో సెటిలైన చిన్ననాటి స్నేహితులను ఫోన్‌లో పలకరించి ఒక చోటకు చేరిన వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. అలాగే చిన్నతనంలో చేసిన అల్లరిచేష్టలను పంచుకున్నారు. అనంతరం ఆ నాటి గురువులను ఘనంగా సత్కరించారు. రఫీ, కామేశ్వరయ్య, మస్తాన్, కోటయ్య తదితరులు ఉన్నారు.

తీరగ్రామాల్లో తహసీల్దార్ పర్యటన



మాట్లాడుతున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: జిల్లా అధికారుల నుంచి తుపాన్ హెచ్చరికలు జారీ కావడంతో స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఆదివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తీర గ్రామాలైన మీజూరు, కారికాడు, వేలికాడు, నాగినేరి తదితర గ్రామాల్లో పర్యాటించారు. తుపాన్ సమయంలో తీర ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతానికి తరలించే విధంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలియజేశారు. అంతేకాకుండా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆమె సూచించారు. దీంతో పాటు మండలంలోని పల్లపు, కాళంగి నదీ పరివాహక ప్రాంతాల్లో కూడా ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో, పల్లపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తుపాన్ హెచ్చరికల కారణంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల సదస్సు ఉండదన్నారు. ఆమె వెంట ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, వీఆర్‌ఓలు జ్ఞానేంద్రం, మధు ఉన్నారు.

పొర్లుకట్టల పనులు పూర్తి చేయండి



పునరావాస కేంద్రాల వద్ద సబ్ కలెక్టర్

వాకాడు: బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి నది వద్ద జరుగుతున్న పొర్లుకట్టల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులను ఆదేశించారు. జిల్లాకు తుపాన్ ప్రభావం ఉండడంతో ఆదివారం ఆయన వాకాడు మండలంలోని పలు ముంపు గ్రామాలను పరిశీలించారు. స్వర్ణముఖి నది పొర్లుకట్టల పనులు పూర్తి చేయాలన్నారు. మండలంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ అన్నపూర్ణారావు, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల నూతన కమిటీ



పూర్వ సంఘం విద్యార్థులు నూతన కమిటీ

సూళ్లూరుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించనున్నట్లు జాయింట్ సెక్రటరీ ఉస్మాన్ బాషా తెలిపారు. అధ్యక్షుడిగా ఎ. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎల్. శ్రీనివాసులు, శివకుమార్‌రెడ్డి, సెక్రటరీగా టి.ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీగా, ఉస్మాన్ బాషా, ట్రెజరర్‌గా బి.ధనుంజయరెడ్డి, సభ్యులుగా ఆర్‌ఎం. ఉమామహేశ్వర్, శ్రీకుమార్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, వీరరాఘవులు, డాక్టర్ సాయిరాం, దుష్యంతయ్య, శ్రీధర్, ఎన్.ఎస్ కుమార్, ఎం.ఎం చంద్రబాబు, సీఎహెచ్. భానుప్రకాష్, డి. సురేష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్‌కుమార్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులును ఎన్నుకున్నారు. షార్ మాజీ డైరెక్టర్ నారాయణ ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీ ఎన్నిక చేపట్టారు.

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

సూళ్లూరుపేట: చెన్నై–కోల్‌కతా రైలు మార్గంలో ఆదివారం ఉదయం రాకపోకలను పునరుద్ధరించారు. తమిళనాడులోని కవర్‌పేట వద్ద శుక్రవారం రాత్రి ఆగివున్న గూడ్స్‌ను మైసూర్–దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న నేపథ్యంలో రైళ్ల రాకపోకలు స్తంభించాయి. శనివారం కొన్ని రైళ్లను మాత్రం గూడూరు నుంచి రేణిగుంట మీదుగా చెన్నైకు పంపించారు. ఆదివారం ఉదయం నాటికి కొన్ని ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించారు. ప్రమాదస్థలంలో యుద్ధ ప్రాతిపదికన పనులను చేసి, ఆదివారం ఉదయానికి రైల్వేమార్గాన్ని పునరుద్ధరించడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

నాయుడుపేట టౌన్: విజయదశమి వేడుకలను శని, ఆదివారాలు రెండు రోజులపాటు ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పండుగ వాతావారణం నెలకొని కోలహలంగా మారింది. పోలేరమ్మ ఆలయం వద్ద శనివారం రాత్రి జరిగిన విజయదశమి వేడుకల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు, పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అమ్మవారికి కుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నిర్వాహకులు ఆకుల కుబేరు మణి, ఆలయ పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, నల్లబోతుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నగరోత్సవం

నాయుడుపేట టౌన్: దేవీనవరాత్రుల ఉత్సవాల పురస్కరించుకుని ముగింపు రోజున ఆదివారం రాత్రి గ్రామదేవత పోలేరమ్మ, మూకాంబికా దేవి నగరోత్సవం వైభవంగా జరిపారు. ఉత్సవాలను సందర్భంగా చివరి రోజు పోలేరమ్మ, మూకాంబికా దేవి అమ్మవార్లను పూలతో అందంగా అలకరించిన వాహనాల్లో అమ్మవార్లను ప్రతిష్ఠించి పట్టణ వీధులలో ఊరేగించారు. శనివారం ఆలయాల్లో అమ్మవార్లకు రాజరాజేశ్వరి దేవి అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. శ్రీవల్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి విజయలక్ష్మీ పూజను ఘనంగా నిర్వహించారు. స్వర్ణముఖి నదీతీరాన ఉన్న దుర్గామల్లీశ్వరిదేవి, పట్టణంలోని మానసదేవి(నాగమానసలమ్మ) ఆలయాల్లో అమ్మవారికి రాజరాజేశ్వరి దేవి అలంకరణ చేపట్టారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం రాత్రి వేడుకల ముగింపు రోజున అమ్మవారి వద్ద ఉంచిన పసుపు, కుంకుమ, గాజులను భక్తులకు పంపిణీ చేశారు. ఆర్య వైశ్య తిరుపతి, నెల్లూరు జిల్లాల రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, కనమర్లపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుదూరులో...

మండల పరిధిలోని పుదూరు గ్రామంలో విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి గ్రామంలో దుర్గాదేవి విగ్రహంతో వేడుకగా గ్రామోత్సవం జరిపారు. గ్రామంలో దుర్గాదేవి ప్రతిమ ఏర్పాటు చేసి, శరన్నవ రాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తులు నిర్వహించారు.



మహిషాసురమర్దనిగా శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు



పోలేరమ్మ ఆలయం వద్ద కుంకుమార్చన

రాపూరులో...

రాపూరు: శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో 10రోజులుగా నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవాన్ని ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. పురవీధుల్లో అమ్మవారి ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఆర్యవైశ్యులు దుకాణాలను మూసివేసి కుటుంబసమేతంగా ఉత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారు తమ ఇళ్ల ముందుకు రాగానే భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

శ్రీబాలాత్రిపురసుందరికి ప్రత్యేక పూజలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు శనివారం బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు విజయదశమి పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు విచ్చేయడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణ చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఆ దివారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగాఅలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ముగిసిన నవరాత్రులు

సూళ్లూరుపేట: పట్టణంలోని కాళంగి నదీ తీరాన ఉన్న శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం విజయదశమితో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా విజయదశమి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి(కోవూరు ఎమ్మెల్యే) దంపతులు మహిషాసుర మర్ధిని అలంకారానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, పసుపుకుంకుమ సమర్పించారు. ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మీ అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు స్వీకరించారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో వేదపండితుల ఆశీర్వాదాలతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గ్రామోత్సవం

శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరురోజున శనివారం రాత్రి అమ్మవారి స్వయంభు రూపమైన మహిషార మర్దినిగా అలంకరించారు. అత్యంత వైభవోపేతంగా గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా వేడుకలు, కోలాటాలు నడుమ అమ్మవారితో ఘనంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి(కోవూరు ఎమ్మెల్యే) దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయానికి సంబంధించిన సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు రూరల్: దసరా సందర్భంగా పట్టణంలో ఆదివారం గ్రామోత్సవాలు నిర్వహించారు. వేకువజామున నారాయణమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ఉత్సవమూర్తులను అలంకరించి వేర్వేరుగా గ్రామోత్సవాలు నిర్వహించారు. కలశాల ముగింపు కార్యక్రమాన్ని సాయంత్రం నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులు



రాపూరులో కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవం



మానసదేవి, దుర్గామల్లేశ్వరి దేవి నగరోత్సవం

తుపాన్‌పై అత్యవసర సమావేశం



తుపాన్‌పై అత్యవసర సమావేశం

దొరవారిసత్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం తుపాన్‌పై అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి చైతన్య మాట్లాడుతూ 14, 15, 16వ తేదీల్లో తుపాన్ వచ్చే అవకాశం ఉందని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

రాపూరు: మండలంలోని గిలకపాడురోడ్డు పాయింట్ సమీపంలోని సిమెంట్ రాళ్ల పరిశ్రమలో పనిచేస్తున్న చెంచులక్ష్మి(30) గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరాజేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. డక్కిలి మండలం దందవోలు గ్రామానికి చెందిన ఏకొల్లు రవీంద్ర, చెంచులక్ష్మి భార్యాభర్తలు. అన్నమయ్యజిల్లా రాజంపేట సమీపంలోని గ్రామం వద్ద సిమెంటురాళ్లు తయారీదారుడు వెంకటసుబ్బారెడ్డి వద్ద పని చేస్తుండేవారు. అతని వద్ద రూ.76 వేలు అప్పు చేసి యజమానికి చెప్పకుండా వచ్చేశారు. వెంకటసుబ్బారెడ్డి వారి ఆచూకీ కోసం ఆరా తీసి, 15 రోజుల క్రితం వారి వద్దకు వచ్చి తన అప్పు తీర్చాలని, లేదా పనికి రావాలని ఒత్తిడి చేయడంతో రవీంద్ర అతనితో వెళ్లాడు. భార్యాభర్తలు నిత్యం ఫోన్‌లో మాట్లాడుకోనేవారు. శనివారం ఇద్దరూ ఫోన్‌లో గొడవ పడ్డారు. దీంతో చెంచులక్ష్మి గుళికలు మింగింది. స్థానికులు గుర్తించి రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.